

మిగిలింది 28.871 టీఎంసీలే..!



తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం

- ప్రతీ రోజు 0.5 టీఎంసీల నీరు ఖాళీ
- తాజాగా కాకతీయ కాలువకు 7,000 క్యూసెక్కులకు పెంపు
- మిషన్ భగీరథ రోజుకు 231 క్యూసెక్కులు

జగిత్యాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తర జిల్లాలకు సాగు, తాగునీరు అందించే వరదప్రదాయినిగా పేరొందిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డ్యామ్‌లో నీటి మట్టం వేగంగా తగ్గుముఖం పడుతోంది. డ్యామ్ పరిధిలోని పలు జిల్లాలకు ఆయకట్టు నీరు విడుదల కొనసాగుతుండడం, రోజురోజుకూ ఎండలు ముదురుతుండడం, పలు జిల్లాలకు మిషన్ భగీరథ పథకం కింద తాగునీటికి సైతం ఎస్సారెస్పీ జలాలను వినియోగిస్తుండడం వల్ల డ్యామ్‌లో నీరు రోజు రోజుకూ తగ్గుతోంది.

ప్రస్తుతం డ్యామ్‌లో రోజుకు సుమారు 20 ఫీట్లు (0.5టీఎంసీల) నీరు కాలువల ద్వారా వెళ్లిపోతోంది. ఎస్సారెస్పీలో 90.3 టీఎంసీల సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 28.871 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎండల తీవ్రత కారణంగా ప్రతీ నిత్యం దాదా పుగా 426 క్యూ సెక్కుల నీరు ఆవిరయిపోతున్నట్లు అధికారుల అంచనాలున్నాయి. రానున్న ఏప్రిల్, మే మాసాల్లో నీటి నిల్వ మరింత తగ్గే ప్రమాదం ఉంది. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని, ప్రతీ నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని ఎస్సారెస్పీ అధికారులు ప్రచారం చేస్తున్నారు.

పెరుగుతున్న సాగు, తాగు నీటి వినియోగం....

ప్రస్తుత యేడాది యాసంగి ఆరంభంలో ప్రాజెక్టులో 90 టీఎంసీలకు గాను 78.342 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కొన్ని రోజులుగా ఎస్సారెస్పీ ప రిధిలోని ఆయకట్టు ప్రాంతానికి నీరును కాలువల ద్వారా విడుదల చేస్తున్నారు. దీంతో నీటి మట్టం రోజురోజుకూ తగ్గుతోంది. ప్రస్తుత సీజన్‌లో ప్రాజెక్టు పరిధిలో పంటల సాగుకు ప్రభుత్వం 60 టీఎంసీల నీరు అవసరమని అంచనా వేసింది. ప్రస్తుతం సుమారు 45 టీఎంసీల నీరును విడుదల చేశారు. ఆయకట్టు పరిధిలో పంటల కోసం మరో 15 టీఎంసీల నీరును విడుదల చేయనున్నారు. రోజురోజుకూ ఎండలు ముదురుతుండడంతో అంచనాకు మించి నీరు వినియోగం అవుతోంది.

కొనసాగుతున్న సాగు నీటి విడుదల...

ఎస్సారెస్పీ డ్యామ్ నుంచి నిర్ణీత ప్రణాళిక ప్రకారం నీరు విడుదల చేస్తున్నారు. వారబంధీ ప్రకారం ఏడు రోజులు నీటిని విడుదల చేస్తూ... ఎనిమిది రోజులు నిలిపివేస్తూ..ఎగువ మానేరు వరకు తరలిస్తున్నారు. గత యేడాది డిసెంబరు 18వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు నీటిని అందించే విధంగా అధికారులు ప్రణాళిక ఖరారు చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా నిజామాబాద్, జగిత్యాల, పెద్ద పల్లి, కరీంనగర్ జిల్లాలకు, సరస్వతీ కాలువ ద్వారా నిర్మల్, లక్ష్మీ కాలువ ద్వారా నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని ప్రాంతాలకు నీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం కాకతీయ కాలువకు 7 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువ ద్వారా 250 క్యూసెక్కులు, సరస్వతీ కాలువ ద్వారా 800 క్యూసెక్కులు, ఎస్కేప్ రెగ్యులేటర్‌కు 426 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 360 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇటీవల కాకతీయ కాలువకు నీటి విడుదలను 5 వేల క్యూసెక్కుల నుంచి 7 వేల క్యూసెక్కులకు పెంచారు.

మిషన్ భగీరథ పథకానికి నీటి విడుదల...

ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు మిషన్ భగీరథ పథకానికిగానూ నిత్యం 231 క్యూసెక్కుల శ్రీరాంసాగర్ జలాలను వినియోగిస్తున్నారు. డ్యామ్ పరిధిలోని జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో గల మిషన్ భగీరథ ట్యాంకులకు విడుదల చేస్తున్నారు. జగిత్యాల, కోరుట్ల మిషన్ భగీరథ పథకానికి నిత్యం 61 క్యూసెక్కులు, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు 63 క్యూసెక్కులు, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు 107 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సగటున ప్రతీరోజు 9,649 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

గత యేడాదితో పోలిస్తే...

గత యేడాదితో ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి మట్టం తక్కువగా ఉంది. గత యేడాది మార్చి మొదటి వారంలో ప్రాజెక్టులో నీటి మట్టం 44.451 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 28.871 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత కారణంగా సాగు, తాగు నీరు వినియోగం మరింత పెరగనుండడం, నీరు ఆవిరి కానుండడం వల్ల అవసరం మేరకు పొదుపుగా వినియోగించుకోవాలని ఎస్సారెస్పీ అధికారులు కోరుతున్నారు.

శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్ర శాసన సభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శనివారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో శ్రీపాదరావు 87వ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీపాదరావు చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన జరిపి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల కోసం పాటు పడిన వ్యక్తి శ్రీపాదరావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకర, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జగిత్యాల ఆర్‌డీవో బాధ్యతల స్వీకరణ

జగిత్యాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఆర్‌డీవోగా మధుసూదన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్‌డీవో నర్సింహమూర్తిని తెలంగాణ బ్రాహ్మిన్ సంక్షేమ సమితి అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా, వేములవాడలో పనిచేస్తున్న ఆర్‌డీవో మధుసూదన్ జగిత్యాల ఆర్‌డీవోగా ఇటీవల బదిలీ చేసిన విషయం విదితమే. ఈ మేరకు పట్టణంలోని ఆర్‌డీవో కార్యాలయంలో మధుసుదన్ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను ఆర్‌డీవో మర్యాదపూర్వకంగా కలిశారు.

జగిత్యాల ఆర్‌డీవోగా బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్‌ను శనివారం ఉద్యోగులు, ఉద్యోగ సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్‌డీవోను జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వకీలు, కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి తఫజిల్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ తిరుపతి కలిసి రెవెన్యూ అసోసియేషన్ నూతన డైరీని అందించి అభినందించారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్, నాయకులు గౌరిశెట్టి విశ్వనాథం, హన్మంత్ రెడ్డి శాలువలతో సత్కరించారు.

ఎన్ఐఏ అదుపులో జగిత్యాల వాసి ?

జగిత్యాల, మార్చి 2 (జగిత్యాల టౌన్) :ప్రభుత్వ నిషేధిత సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాలో జగిత్యాలకు చెందిన కీలక నేతగా వ్యవహరిస్తున్న సలీం అనే వ్యక్తిని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలియడంతో జగిత్యాలలో కలకలం రేపింది. రెండేళ్లుగా పోలీసులతో పాటు ఎన్ఐఏ అధికారుల కళ్లు కప్పి తిరుగుతున్న సలీంపై రివార్డు కూడా ప్రకటించారు. అయితే కడప జిల్లాలోని మైదుకూర్‌లో సోమవారం సలీంను ఎన్ఐఏ అధికారులు పట్టుకుని హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. దీంతో సలీంను ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారంటూ జగిత్యాలలో పలువురు చర్చించుకోవడం, పోలీసులు కూడా సరైన సమాచారం ఇవ్వకపోవడం పలు అనుమానాలను రెకెత్తిస్తున్నాయి.

జగిత్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు

జగిత్యాల టౌన్, మార్చి 2 : జగిత్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్ వేణుగోపాల్ ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డిలు కలిశారు. శనివారం హైద్రాబాద్‌లోని సెక్రటేరియట్‌లో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలతో పాటు పలువురు గల్ఫ్ కార్మిక సంక్షేమ సంఘాల నాయకులతో పాటు వెళ్లి సీఎంను కలిశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న గల్ఫ్ కార్మికుల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాల్సి ఉందని విజ్ఞప్తి చేశారు. గల్ఫ్ దేశాల్లో మరణించిన వారికి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియాకు ప్రత్యేక జీవో జారీ చేయాలని సూచించారు. ఎన్ఆర్ఐ సంక్షేమ బోర్డు, గల్ఫ్ సంక్షేమ బోర్డు, హెల్ప్ లైన్ ఏర్పాటు తదితర అంశాలను వివరించారు.

పట్టుబట్టి..కొలువులు కొట్టి

ఒకేసారి పలు శాఖల్లో ఉద్యోగాలు సాధించిన యువత

పెగడపల్లి, మార్చి 2 : ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఐదు ఉద్యోగాలు సాధించి మండలంలో ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచింది ల్యాగలమర్రి గ్రామానికి చెందిన పుప్పాల మమత. ల్యాగలమర్రి గ్రామానికి చెందిన పుప్పాల భూమయ్య రమ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి కూతురు మమత సిరిసిల్లలోని గురుకుల డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగంలో అతిథి అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తూ గత సంవత్సరం ప్రభుత్వం నిర్వహించిన ఉద్యోగాల పోటీ పరీక్షలను రాయగా మున్సిపల్ జూనియర్ అకౌంట్ ఆఫీసర్, గురుకులాల్లో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్‌తో పాటుగా డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలు సాధించి సత్తా చాటింది. మమతను అభినందిస్తూ, యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొంటున్నారు.

దంపతులకు మూడు ఉద్యోగాలు

మెట్‌పల్లి రూరల్: కష్టపడి చదివితే సాధించలేనిది ఏది లేదని మండలంలోని మారుతీనగర్ గ్రామానికి చెందిన దంపతులు శనిగరం విజయ్‌కుమార్, స్వప్నికాలు ఏకంగా మూడు ఉద్యోగాలు సాధించారు. ప్రభుత్వం ప్రకటించిన జూనియర్ లెక్చరర్ ఫలితాలలో ఉద్యోగానికి ఎంపిక అవడంతో పాటు గురుకుల ట్రైన్డ్ గ్రాడ్యూయేట్ టీచర్‌గా అర్హత సాధించారు. ఆయన భార్య స్వప్నికా సైతం ట్రైన్డ్ గ్రాడ్యూయేట్ టీచర్‌గా ఇంగ్లీష్ సబ్జెక్టుకు ఎంపికైంది.

నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన దేదీప్య

కోరుట్ల: కోరుట్ల పట్టణానికి చెందిన కటకం దేదీప్య ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగ పరీక్ష ఫలితాలలో నాలుగు ఉద్యోగాలను సాధించింది. పట్టణానికి చెందిన కటుకం సుమని-శంకర్ దంపతుల కూతురు దేదీప్య పీజీటీ, జూనియర్ లెక్చరర్ (పొలిటికల్ సైన్స్), డీగ్రీ లెక్చరర్ (పొలిటికల్ సైన్స్), గ్రూప్ 4 పరీక్షలు రాసి నాలుగు ఉద్యోగాలకు ఎంపికైంది. దేదీప్య తండ్రి శంకర్ ప్రధానోపాధ్యాయుడిగా పదవి విరమణ పొందాడు. తల్లి సుమని ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పని చేస్తుంది.

జాతర హుండీ ఆదాయం లెక్కింపు

బీర్‌పూర్,మార్చి 2: బీర్‌పూర్ లక్ష్మీనరసింహా స్వామి జాతర బ్రహ్మోత్సవాల హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. ఆలయానికి 26లక్ష 6వేల 719 రూపాయలు సమకూరింది. టెండర్ల రూపంలో 13లక్షల 75 వేల 86 రాగా హుండీలో భక్తుల కానుకల రూపంలో12లక్షల 31వేల 633 రూపాయలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మిశ్రమ బంగారం 14గ్రాములు, మిశ్రమ వెండీ 2కిలోల 20గ్రాములు, విదేశీ నోట్లు 9వచ్చినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయశాఖ జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్, ఎంపీపీ మసర్తి రమేష్, కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, ఉత్సవ కమిటీ చైర్మన్ స్వామాట్ పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుడికి ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బుగ్గారం మండలానికి చెందిన రాజ్యసభ సభ్యుడు దీవకొండ దామోదర్ రావును శనివారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ పరామర్శించారు. హైద్రాబాద్‌లోని బంజరా హిల్స్‌లో గల దామోదర్ రావు నివాసంలో ఆయన తల్లి దీవకొండ అండాలు మృతి చెందడంతో పార్థివదేహంపై పూలు చల్లి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్ కేఆర్ సురేశ్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కేశవరావు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

తహసీల్దార్ రమేష్

సారంగాపూర్, మార్చి, 2 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ దుబ్బ రాజన్న జాతర బ్రహోత్సవాలను విజయవంతం చేయాలని తహసీల్దార్ రమేష్ అన్నారు. శనివారం ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర బ్రహ్మోత్సవాలు ఈ నెల 6 నుంచి 11 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు గాను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉలుగకుండా ఆయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఈవో అనూష, ఆలయ ఫౌండర్ శంకరయ్య, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంటలు ఎండకుండా నీరందించి ఆదుకోవాలి

- ముఖ్యమంత్రికి విన్నవించిన విప్ అడ్లూరి

వెల్గటూర్, మార్చి 2: ధర్మపురి నియోజకవర్గంలోని రైతాంగానికి ఎండాకాలంలో పంటలు ఎండకుండా నీరు అందించి ఆదుకోవాలని ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. డి74, డి83, డి84 కాలువల ద్వారా ధర్మారం, వెల్గటూర్ ప్రాంతాలకు సాగు నీరు అందించాలని కోరారు. డి83 కాకతీయ మేయిన్ కెనాల్ ద్వారా 3200 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్నా ప్రస్తుతం 2500 క్యూసెక్కుల నీరు మాత్రమే జరుగుతుందని సీఎం దృష్టికి తెచ్చారు. పెగడపల్లి మండలంలోని కొత్త చెరువు, మద్దుల పల్లి పెద్ద చెరువు, లింగాపూర్ గ్రామంలోని రెండు చెరువుల నీటి ద్వారా సుమారు 677 ఎకరాల ఆయకట్టుకు సాగు, తాగు నీరు అందించడం జరుగుతుందని ప్రస్తుతం ఆ చెరువుల్లో నీటి సీమర్థ్యం తక్కువగా ఉందని సీఎం దృష్టికి తెచ్చారు. నియోజక వర్గంలోని రైతాంగానికి నష్టం కలుగకుండా సాగు, తాగు నీరు అందించి ఆదుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

- నిర్వాసితులకు పెండింగ్ పరిహారం అందించాలి

వెల్గటూర్ మండలంలోని ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న పరిహారం అందించాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం సీఎంను కలిసి విన్నవించారు. చెగ్యాంలో 126 ఇళ్ల నిర్మాణాలకు రూ.18 కోట్లు పరిహారం అందించాలని కోరారు. చెగ్యాం, రాంనూర్, ముక్కట్రావ్‌పేట, కోటిలింగాల, ఉండెడ, తాళ్లకొత్తపేట గ్రామాలకు చెందిన 250 మంది నిర్వాసితులకు వన్ టైం సెటిల్‌మెంట్ కిందరూ.5 కోట్లు అందించాలని కోరారు. ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు ముంపు గ్రామాలకు సంబంధించి రూ.2.06 కోట్లు పెద్దపల్లి కలెక్టర్ నుంచి జగిత్యాల కలెక్టర్ పీడీ ఖాతాకు బదిలీ చేయడానికి అధికారులకు సూచనలు ఇవ్వాలని కోరారు.

మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలిగా అనిత



నియామక పత్రం అందజేస్తున్న జీవన్ రెడ్డి

జగిత్యాల, మార్చి 2 (జగిత్యాల టౌన్): కాంగ్రెస్ పార్టీ జగిత్యాల పట్టణ అధ్యక్షురాలిగా మాజీ కౌన్సిలర్ పిప్పరి అనిత నిమమితులుగా కాగా నియామక పత్రాన్ని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ పటిష్టతకు కృషి చేయాలన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనిత నియామకం పట్ల కాంగ్రెస్ నాయకులుగా జుల రాజేందర్, దయాల శంకర్, హరికృష్ణ, సరిత రమేష్ రావు, రమణ, రవి, అశోక్, అంజన్న హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి ఉన్నారు.

గుండె పోటుతో ఏఎస్సై మృతి



రాజేందర్ (ఫైల్)

కోరుట్ల, మార్చి 2 : కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వ హిస్తున్న రాజేందర్ శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. రాజేందర్ స్వస్థలం కోరుట్ల పట్టణంలోని ఎకలవ్య కాలనీలో నివాసం ఉంటూ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్ఐ విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 4వ తేదీన ఆదిలాబాదు జిల్లాలో జరుగు ప్రధాన మంత్రి బహిరంగ సభకు బందోబస్తు నిర్వహించడానికి సిద్ధం అవుతుండగా రాజేందర్ గుండె పోటుకు గురై కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రాజేందర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, కోరుట్ల సీఐ ప్రవీన్ కుమార్, ఎస్ఐ కిరణ్ కుమార్, సిబ్బంది సంతాపం ప్రకటించారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

మహిళా సాధికారత డిస్టిక్ కో ఆర్డినేటర్ అశ్విని

జగిత్యాలరూరల్, మార్చి 2 : సమాజంలో మహిళల పాత్ర కీలకమని, సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందంటే దాని వెనుక మహిళ ఉందని మహిళాసాధికారత డిస్టిక్ కో ఆర్డినేటర్ అశ్విని పేర్కొ న్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురష్కరిం చుకొని మహిళా సాధికారత కేంద్ర బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మహిళాసాధికారత డిస్టిక్ కో ఆర్డినేటర్ అశ్విని, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లావణ్య, మెడికల్ ఆఫీసర్ శామిని, సెర్ప్ సీసీ గంగారాం, అంగన్ వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

అందని ‘పల్లె దవాఖానా’ సేవలు

- చెప్యాలలో శిలాఫలకానికే పరిమితమైన పనులు
- కొడిమ్యాలలో పిల్లర్ల స్థాయిలోనే ఆగిన నిర్మాణం
- పంచాయతీ గదిలో విధులు నిర్వహిస్తున్నవైద్య సిబ్బంది



కొడిమ్యాలలో పిల్లర్ల స్థాయిలో నిలిచిన భవనం

కొడిమ్యాల, మార్చి 2 : మండలంలోని చెప్యాల గ్రామంలో పల్లె దవాఖాన భవన నిర్మాణం శిలాఫలకానికి పరిమితమైంది. గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు చేరువ తీసుకరావాలన్న ఉద్దేశంతో చేపట్టిన పల్లె దవఖాన భవనాల నిర్మాణాలు ప్రభుత్వ లక్ష్యానికి దూరంగా ఉన్నాయి. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ గత సంవత్సరం మే 25న మండలంలోని చెప్యాల, కొడిమ్యాలలో పల్లె దవాఖాన భవన నిర్మాణ పనులకు శిలా ఫ లకాలను ఆవిష్కరించారు. 8 నెలలు గడిచిన చెప్యాల గ్రా మంలో పల్లె దవాఖాన భవన నిర్మాణం కోసం స్థలం నిర్ణయం కాక పోవటంతో పల్లె దవఖాన భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీంతో చెప్యాల గ్రామ ప్రజలు అధికారులు, పాలకులు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొడిమ్యాలలోని ఎస్సీ కాలనీలో నిర్మాణం చేపట్టిన పల్లె దవఖాన భవన నిర్మాణ పనులు ఆరు నెల లుగా పిల్లర్ల స్థాయిలోనే నిలిచి పోయాయి. మండలం లోని నాచుపల్లి గ్రామంలో పల్లె దవాఖాన భవనం ఇటీవల ప్రారం భోత్సవం జరిగింది. చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మండల అధికారులు, మండల ప్రజాప్రతినిధులు పట్టిం చుకొ ని చెప్యాలలో పల్లె దవఖాన భవన నిర్మాణం కోసం స్థలం నిర్ణయం చేయాలని, కొడిమ్యాలలో అసంపూర్తి పల్లె దవ ఖాన భవన నిర్మాణం పూర్తి చేయించాలని మండల ప్రజ లు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత ఏఈఈ నాగరాజును వివరణ కోరగా చెప్యాలలో స్థల నిర్ణయం కా గానే భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.





చెప్యాలలో ఆవిష్కరించిన శిలాఫలకం(ఫైల్)...పంచాయతీ గదిలో పల్లె దవఖాన

నకిలీ చిరునామా కేసులో మీ సేవా కేంద్రం నిర్వాహకుడు, మరొకరి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, మార్చి 2: నకిలీ చిరునామాతో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసిన కేసులో రుద్రంగి మండల కేంద్రంలో గల గాయత్రి మీ సేవా కేంద్రం యజమాని లోలావత్ పరమజిత్‌ను, కథలాపూర్ మండలం కలికోట గ్రామానికి చెందిన దరావత్ షెర్మాన్‌ను శనివారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరి వద్ద నుంచి కంప్యూటర్, స్కానర్, ప్రింటర్, ఒరిజినల్, నకిలీ ఆధార్‌కార్డు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు పాస్‌పోర్ట్ దరఖాస్తు విషయంలో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ప్రభుత్వ ఉద్యోగులను తప్పు దోవ పట్టించారని తెలిపారు. కథలాపూర్ మండలంలోని కలికోట గ్రామానికి చెందిన దరావత్ షెర్మాన్ అనే వ్యక్తి గతంలో ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లి అక్కడ జైలు శిక్ష అనుభవించాడు. తిరిగి స్వదేశానికి వచ్చి ఎలాగైనా మళ్లీ విదేశాలకు వెళ్లాలని పాస్‌పోర్ట్‌కోసం మీసేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. ఇందులో భాగంగా స్పెషల్ బ్రాంచి పాస్‌పోర్ట్ ఎంక్వైరీలో భాగంగా షెర్మాన్ సమర్పించిన పత్రాలు అనుమానంగా భావించి సంబంధిత కానిస్టేబుల్ దేవరాజు రుద్రంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యా దు మేరకు విచారణ చేపట్టగా రుద్రంగిలోని గాయత్రి మీసేవా కేంద్రం నిర్వాహకుడు లోలావత్ పరమజిత్ ద్వారా ఆధార్ కార్డులో షెర్మాన్‌కు బదు లుగా షెర్మాన్‌నాయక్ అని చిరునామా కలికోట గ్రామానికి బదులుగా రుద్రం గిగా మార్చడమే కాకుండా విద్యార్హతలు, పుట్టిన తేదీలు మార్చి పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేశారని ఆయన తెలిపారు. ఈ విధంగా నకిలీ చిరునామా పెట్టి దరఖాస్తు చేసిన వ్యక్తితో పాటు మీసేవా కేంద్రం నిర్వాహకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

52మంది మందుబాబులకు జైలు శిక్ష, జరిమానా

సిరిసిల్ల క్రైం, మార్చి 2: సిరిసిల్ల పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 52మంది మందుబాబులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శనివారం తీర్పు ఇచ్చారని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 26మందికి ఒక్కొక్కరికి రెండురోజుల జైలు శిక్షతో పాటు మూడువేల రూపాయల జరిమానా విధించారని తెలిపారు. మరో 25మంది మందుబాబులకు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయల చొప్పున జరిమానా విధించారని తెలిపారు. మందుబాబులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీస్ కస్టడీలో అక్షర చిట్‌ఫండ్ ఛైర్మన్, డైరెక్టర్లు

కరీంనగర్ క్రైం, మార్చి 2: ఖాతాదారులకు సకాలంలో డబ్బు చెల్లించకుండా మోసగించి చిట్‌ఫండ్ కంపెనీలో ఖాతాదారులు జమచేసుకున్న డబ్బుతో సొంత ఆస్తులు కూడబెట్టిన కేసులో అక్షర చిట్‌ఫండ్ ఛైర్మన్ పేరాల శ్రీనివాసరావు, ఎస్ కొండాల్‌రావు, ఉప్పల రాజేందర్‌లను ఒకటవ టౌన్ పోలీసులు ఆరు రోజుల కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. సీతారాంపూర్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి శ్రీరాం వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో ఫిబ్రవరి 21న అక్షర చిట్‌ఫండ్ ఛైర్మన్, డైరెక్టర్లపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు వారిని అదే రోజు అరెస్టు చేసి జైలులో రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని కీలక ఆధారాలు సేకరించేందుకు నిందితుల్లో ముగ్గురిని పోలీసులు కోర్టు ద్వారా శుక్రవారం సాయంత్రం కస్టడీకి తీసుకున్నారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం వరకు వీరిని విచారించనున్నారు. కరీంనగర్ రాజీవ్‌చౌక్, కోతిరాంపూర్, జ్యోతినగర్‌లలో ఉన్న అక్షర చిట్‌ఫండ్ బ్రాంచీలలో తనిఖీలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

గంగాధర, మార్చి 2: కారు ఇంటి పిల్లరును ఢీకొన్న ఘటనలో గంగాధర మండలం కాచిరెడ్డిపల్లికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. గ్రామస్థుల వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన కోల విక్రమ్(31), కుంట రమేష్(32)లతో పాటు మరో ఇద్దరు శనివారం వేకువ జామున కారులో తిరుపతి దర్శనానికి బయలు దేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఓ ఇంటి పిల్లరును ఢీకొట్టింది. ఈ ఘటనలో కుంట రమేష్ అక్కడి కక్కడే మృతి చెందగా విక్రమ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారులోని మరో ఇద్దరికి తీవ్రంగా గాయాలైనట్లు సమాచారం. ఇద్దరు యువకుల మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్,మార్చి 2 : మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులో ద్విచక్రవాహనాలు ఢీకొని సూర్నపల్లి రాజయ్య (56) మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సబ్బితం గ్రామానికి చెందిన సూర్నపల్లి రాజయ్య స్వగ్రామం నుంచి పెద్దపల్లికి ద్విచక్రవాహనంపై వస్తుండగా మరొకరు రంగాపూర్ గ్రామ శివారులో ద్విచక్రవాహనంతో వెనుకనుండి ఢీకొట్టాడు. రాజయ్య తలకు తీవ్ర గాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ స్వామి తెలిపారు.

కుటుంబ పాలన, కుంభకోణాలతో రాష్ట్రం కుదేలు

- అబద్దాల పునాదులపై పురుడు పోసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- దేవుణి మాన్యాలను కబ్జా చేస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదు
- బీజేపీ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



వేములవాడలో మాట్లాడుతున్న నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

వేములవాడ టౌన్, మార్చి 2: కుటుంబ పాలన, కుంభకోణాలతో రాష్ట్రం కుదేలైందని బీజేపీ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందంటే ప్రధాన మోదీతోనేనని, ప్రపంచ దేశాల్లోనే భారత్ మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదగబోతుందంటే ప్రధాని మోదీ సంకల్పానికి నిదర్శనమన్నారు. దేశంలో రాబోయేది రామరాజ్యమని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాసంగ్రామ యాత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా వేములవాడకు వచ్చిన ఆయన సమావేశంలో మాట్లాడారు. విజయ సంకల్ప యాత్ర ఒక కొత్త మలుపునకు నాంది పలికిందని అన్నారు. రాజకీయ చరిత్రలో వేడిపుట్టించిందని, రాష్ట్రంలో అత్యధిక సీట్లు గెలువబోతున్నామని విశ్లేషకులు చెబుతున్నారని అన్నారు. వేములవాడకు వచ్చిన తరువాతనే ఓ శుభవార్త తెలిసిందని, రాష్ట్రంలో 9 మంది అభ్యర్థులను ప్రకటించగా కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా బండి సంజయ్ పేరు ఖరారు చేశారని వెల్లడించారు. సుమారు 2 లక్షల మెజార్టీతో బండి సంజయ్ గెలువబోతున్నాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నో యేళ్లుగా రాష్ట్రం కుటుంబ పాలనతో విసుగిపోయిందన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షల కోట్ల కుంభకోణం జరిగిందని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన తరువాత సీబీఐ ఎంక్వైరీ కోసం ఒక్క లెటర్ ఇవ్వమంటే ఎందుకు ఇవ్వలేరని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి కాళేశ్వరం ప్రాజెక్టులో ఎవరైనా బంధువులు, మిత్రులు కానీ ఉన్నారా అని ప్రశ్నించారు. నాకు ఒక్క లెటర్ ఇస్తే 48 గంటల్లో సీబీఐ ఎంక్వైరీ పెట్టిస్తానని, దమ్ముంటే ఒక్క లేటర్ ఇవ్వు రేవంత్‌రెడ్డి అని సవాల్ విసిరారు. అధికారం చేజిక్కించుకునేందుకు నోటికి వచ్చిన అబద్దాలు చెపుతూ అధికారంలోకి వచ్చారని, కేవలం బ్లాక్‌మెయిల్ చేయడం కోసమే ముఖ్యమంత్రి పదవి తీసుకున్నాడని ఆరోపించారు. నాలుగు వందల పైచిలుకు హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయలేదని అన్నారు. ఆరు గ్యారంటీల పేరు చెప్పి నాలుగు అమలు చేశామని అంటున్నారు. అది సాధ్యం కాదని ఆరు గ్యారంటీలు అమలు జరగాలంటే రూ.1.65 లక్షల కోట్లు కావాలని, కానీ రూ.53 వేల కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. గ్యారంటీల అమలు ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 ఇస్తామని, నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామని అసెంబ్లీలో మాట్లాడలేదని, వాటిపై తాను ప్రశ్నిస్తే ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మేము హామీ ఇవ్వలేదని మాట దాటవేసిన మహానీయులు అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడితప్పి అతలాకుతలం అవుతుందని, ప్రధాని మోదీ రూ. 9 వేల కోట్ల ఇస్తేనే ప్రభుత్వం వడ్డీలు, జీతాలు వెల్లదీస్తోందన్నారు. అలాంటి మోదీని విమర్శించే అర్హత రేవంత్‌రెడ్డికి లేదని అన్నారు. మరో మారు ప్రధానిని విమర్శిస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో సీతారాములకు సంబంధించిన 11 వందల ఎకరాలను దేవుడి మాన్యాన్ని అక్కడున్న రంజిత్‌రెడ్డి, కేటీఆర్ కలిసి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని ఇండస్ట్రియల్ పేరుతో రూ.20 లక్షల నుంచి రూ. 15 లక్షలకు ఎకరం కేటాయించి కమిషన్‌లు పొందారని ఆరోపించారు. దేవుడి మాన్యాల జోలికి వస్తే ఖబడ్దార్, బీజేపీ పార్టీ ఊరుకోదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర మతాలకు చెందిన వారి దేవుళ్లకు చెందిన భూమిని తీసుకునే దమ్ము పాలకులకు ఉందా అని ప్రశ్నించారు. హైదారాబాద్ నడిబొడ్డు లోని జూబ్లీహిల్స్‌లో అక్కడి ఎంపీ అని చెప్పుకుని తిరిగే రంజిత్‌రెడ్డి 400 ఎకరాల హనుమాన్ దేవాలయాన్ని కూలగొట్టి అక్కడి భూమిని కబ్జా చేసి అపార్ట్‌మెంట్ నిర్మాణం చేస్తున్నాడని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దమ్ము ధైర్యం వుంటే ఆధారాలతో సహా ఇస్తాను దాన్ని నిలిపివేసి దేవాలయానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. నిర్మల్ నియోకవర్గంలో సైతం శ్రీకృష్ణుని చెందిన భూమి సైతం కబ్జా చేస్తే సర్వే చేసి వెలికి తీస్తున్నానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, దీప, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మైపాల్‌రెడ్డి, ఎర్రం మహేష్, మల్లికార్జున్, కుమ్మరి శంకర్, గురుమూర్తి శివశంకర్, సంతోష్‌బాబు, జక్కుల తిరుపతి తదితరులు ఉన్నారు.

రాజన్నను దర్శించుకున్న మహేశ్వర్‌రెడ్డి

వేములవాడ టౌన్ : వేములవాడ రాజరాజేశ్వరస్వామిని శనివారం సాయంత్రం బీజేపీ శాసనసభాపక్ష నేత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వదించగా, ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకులు రేగుల సంతోష్‌బాబు, నామాల శేఖర్, సగ్గు రాహుల్ ఉన్నారు.

కొనసాగుతున్న న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, మార్చి 2: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వీ కన్వెన్షన్‌లో ఈ నెల 1న ప్రారంభమైన న్యూరో డాక్టర్ల రాష్ట్రస్థాయి సదస్సు కొనసాగుతోంది. ఈ సదస్సులో శనివారం నిమ్స్ ప్రొఫెసర్ విజయసారధి పాల్గొని ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెన్నెముక చికిత్సలో కోత లేకుండా ఎండోస్కోపీ ద్వారా శస్త్ర చికిత్సలు ఎలా చేయాలని వివరించారు. అనంతరం కిమ్స్ హాస్పిటల్ న్యూరో సర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రహీ మాట్లాడుతూ గతంలో క్యాన్సర్ ట్యూమర్ చికిత్స తీసుకోవాలంటే ఆరు వారాలు అవసరం ఉండేదన్నారు. ప్రస్తుతం రేడియో సర్జరీ ద్వారా రెండు నుంచి ఐదు రోజులు మాత్రమే చికిత్స తీసుకుంటే సరిపోతుందన్నారు. రోబోటిక్ సర్జరీ, ఎండోస్కోపీ, నావిగేషన్, అల్ట్రాసోనిక్, ఆస్పురేటీవ్, లేజర్‌ల ద్వారా అత్యాధునిక చికిత్స అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. వాటితో పాటు మైక్రోస్కోప్ సర్జరీలు అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. ప్రస్తుతం సర్జరీ అవసరం లేకుండానే రేడియేషన్‌తో చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. దాంతో పేషంట్ ఒక్క రోజులోనే డిశ్చార్జి అవుతున్నారని తెలిపారు. స్పైనల్ కార్డు స్టీమ్‌లెటర్ అందుబాటులోకి రావడం పక్షవాతానికి గురైన వ్యక్తులకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించడం సంతోషకరమన్నారు. న్యూరో విభాగంలో నూతనంగా వస్తున్న మెళకువలను నేర్చుకోవడానికి ఇలాంటి సదస్సులు ఎంతో దోహదపడతాయన్నారు. డాక్టర్ దాసరి వెంకటేష్ మాట్లాడుతూ రోడ్లు సరిగా లేకపోవడం, ఎక్కువ సేపు ప్రయాణాలు చేయడంతోనే వెన్నుముక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. వాటితోపాటు ఎక్కువసేపు ఒకే చోట కూర్చోవడం, సరైన ఆహారం తీసుకోకపోవడం, ఒత్తిడికి గురికావడం కూడా కారణమన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు తీసుకుంటే ప్రాథమిక దశలోనే నివారించవచ్చున్నారు. కార్యక్రమాన్ని కరీంనగర్‌కు చెందిన సీనియర్ వైద్యులు డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ పీవీకే కిషోర్, డాక్టర్ దాసరి శ్రీనివాస్, డాక్టర్ జొన్నల శ్రీనివాస్, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ సంజయ్‌లు పర్యవేక్షిస్తున్నారు.

12 వరకు ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ పరీక్ష ఫీజు గడువు

గణేశ్‌నగర్, మార్చి 2:ఎస్‌యూ పరిధిలోని ఎం ఫార్మసీ మొదటి సెమిస్టర్ మూడో సెమిస్టర్ విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం ఈనెల 12 వ తేదీ వరకు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. 300రూపాయల అపరాధ రుసుంతో 15వ తేదీ వరకు చెల్లించాలనిఅన్నారు. పరీక్షలను మార్చి లేదా ఏప్రిల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

●ఎస్‌యూ పరిధిలోని బీఫార్మసీ మొదటి సెమిస్టర్, ఏడో సెమిస్టర్ (రెగ్యులర్ సప్లిమెంటరీ) రెండో సెమిస్టర్, ఎనిమిదో సెమిస్టర్(సప్లిమెంటరీ) విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం ఈనెల 12వ తేదీ వరకు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 15వ తేదీ వరకు చెల్లించాలని ఆయన అన్నారు.

రేపు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు

సుభాష్‌నగర్, మార్చి 2: సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఇంటర్నేషనల్ సంస్థలో 400ల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ఈ నెల 4న నగరంలోని అంబేద్కర్ స్టేడియం సమీపంలోని స్వశక్తి కళాశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని డిఆర్‌డిఏ పిడి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఆపై విద్యార్హతతో పాటు 19 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులన్నారు. తమ బయోడేటాతో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హతల జిరాక్స్ ప్రతులు తీసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 14 వేల నుంచి 21 వేల వరకు వేతనంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ బోనస్ గ్రాట్యుటీ అందజేస్తారన్నారు.

రేపు ఎస్సారార్ కళాశాలలో జాబ్ మేళా

గణేశ్‌నగర్, మార్చి 2: ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ నాలెడ్జి సెంటర్ (టిఎస్‌కెసి) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, టిఎస్‌కెసి కో-ఆర్డినేటర్ సిహెచ్ మారుతి తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఆదర్శ నెక్సా షోరూం పాల్గొంటుందని తెలిపారు. డిగ్రీ పాసైన వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు ఎస్సారార్ కళాశాల, టిఎస్‌కెసి సెంటర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రైవేటీకరణ కోసమే నూతన విద్యావిధానం



సమావేశంలో మాట్లాడుతున్న నద్దునూరి అశోక్‌స్టాలిన్

భగత్‌నగర్, మార్చి 2: విద్య ప్రైవేటీకరణ కోసమే నూతన విద్యా విధానమని దీనిని ప్రజలందరూ వ్యతిరేకించాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020 లోపాల పుట్ట అని విమర్శించారు. విద్య కాషాయీకరణ, ప్రైవేటీకరణ, కేంద్రీకరణ కోసమే నూతన విద్యా విధానమన్నారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడంలో విఫలమైన కరీంనగర్ ఎంపీ ఓట్లు ఎలా అడుగుతారని ఆయన ప్రశ్నించారు. ఎన్‌ఈపీ రద్దుకు ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడు తున్నా మన్నారు. ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు దూరం చేసే కుట్ర పన్నుతున్నాయన్నారు. దేశంలో జాతీయ విద్యావిధానం వల్ల 90శాతం మంది విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందే హక్కును కోల్పోతారన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, అడపా సాయికృష్ణ, వినయ్‌రెడ్డి, అజయ్ రాహుల్, నాని, సుధీర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో బీజేపీ నాయకుడు, మరో ఇద్దరిపై కేసు

సిరిసిల్ల క్రైం, మార్చి 2: సిరిసిల్ల పట్టణంలోని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడి భూమిని నకిలీ పత్రాలు సృష్టించి అక్ర మంగా కాజేసేందుకు ప్రయత్నించడమే కాకుండా చం పుతామని బెదిరించిన సంఘటనలో బీజేపీ నాయకుడితో పాటు మరో ఇద్దరిపై సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. సిరిసిల్ల డీఎస్పీ భీంశర్మ వివరా ల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని గూడూరి ప్రవీణ్‌కు చెందిన సర్వేనంబర్ 1562లో 363గజాల భూమిని అక్ర మించాలనే ఉద్దేశంతో తప్పుడు దస్తావేజులతో కె చందన భూమిని చౌటుపల్లి చంద్రశేఖర్‌కు జీపీఏ చేశారు. ఆ తర్వాత చౌటుపల్లి చంద్రశేఖర్ అదే భూమిని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డెబోయిన గోపికి విక్రయించారు. గోపి ఈ భూమిలో నుంచి 180గజాల భూమిని తిరిగి కె చందన కు రిజిస్ట్రేషన్ చేశారు. భూమిని తమకు అప్పగించాలని లేకుంటే చంపుతామని బెదిరించారని బాధితుడు బీఆర్‌ఎస్ రాష్ట్రనాయకుడు గూడూరి ప్రవీణ్ ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డెబోయిన గోపిని అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచామని తెలిపారు. జిల్లాలో భూ కబ్జాలు చేస్తూ, నకిలీ పత్రాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడే వారి సమాచారం ఇవ్వాలని, వారి నేర ప్రవృత్తిని ప్రజలు ధైర్యంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు.

జార్జియాలో వైద్య విద్యార్థిని మృతి


పంజాల రిచిత(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మార్చి2: హుజూరాబాద్ మండలంలోని జూపాక గ్రామానికి చెందిన వైద్య విద్యార్థిని పంజాల రిచిత(20) అనారోగ్యంతో జార్జియాలో శనివారం మృతి చెందింది. గ్రామానికి చెందిన పంజాల రాజు కుమార్తె రిచిత జార్జియాలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొద్ది రోజుల క్రితం రిచిత ఊపిరి తిత్తులకు ఇన్‌ఫెక్షన్ సోకి పరిస్థితి విషమించింది. తోటి విద్యార్థులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


హరీష్ (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, మార్చి, 02 : మండలంలోని వెల్లుల్ల గ్రామంలో కేటీఆర్‌నగర్‌కు చెందిన నేరెళ్ల హరీష్(25) అనే యువకుడు ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై చిరంజీవి శనివారం తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన నేరెళ్ల హరీష్ ఓ యువతిని కొంత కాలం నుంచి ప్రేమించాడు. ఆ అమ్మాయికి వేరే వ్యక్తితో పెళ్లి కుదిరింది. ఈ క్రమంలో తాగుడుకు బానిసైన హరీష్‌ను ఫిబ్రవరి 29న మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి తల్లి తీసుకెళ్లింది. శనివారం ఇంట్లో ఒంటరిగా ఉన్న హరీష్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మహిళ ఆత్మహత్య


శ్రీలత(ఫైల్)

జ్యోతినగర్, మార్చి 2: కొడుకు చనిపోతానని బెదిరించడంతో నువ్వు ఎందుకు చనిపోవడం కొడుకా..నేనే చనిపోతా అంటూ క్షణికావేశంలో ఓ తల్లి ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఉదంతం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో చోటుచే సుకుంది. ఎస్‌ఐ ఉదయకిరణ్ కథనం ప్రకారం.. ప్రగతినగర్‌కు చెందిన పైండ్ల శ్రీలత (40) రవి దంపతులకు రాజ్‌కుమార్, అక్షితలు సంతానం, రాజ్‌కుమార్ హన్మకొండలో డిప్లమో చదువుతున్నాడు. వృధాగా డబ్బులు ఖర్చు పెడుతుండటంతో కొడుకు రాజ్‌కుమార్‌ను తల్లిదండ్రులు మందలించారు. మనస్థాపం చెందిన రాజ్‌కుమార్ తన తల్లి శ్రీలతకు ఈ నెల ఒకటిన రాత్రి ఫోన్ చేసి తన అవసరాలకు ఖర్చులకు డబ్బులు పంపించడం లేదని చనిపోతానని బెదిరించాడు. నువ్వు ఎందుకురా చని పోవడం నేనే చచ్చిపోతా అంటూ తల్లి శ్రీలత క్షణికా వేశంలో ఇంట్లో ఉన్న డీజిల్ డబ్బాలోని డీజిల్‌ను ఒంటి పై పోసుకుని నిప్పంటించుకుంది. గోదావరిఖని ప్రభుత్వ అసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోందని డాక్టర్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో మునిగి పశువుల కాపరి మృతి

మెట్‌పల్లి రూరల్, మార్చి2 : మండలంలోని వేంపేట గ్రామంలో పశువుల కాపారి కోడి స్వామి(48) ప్రమాదవశాత్తు చెరువులో మునిగి శనివారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మంచిర్యాల జిల్లా లక్సెట్‌పేట్ మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కోడి స్వామి జీవనోపాధి కోసం మండలంలోని వేంపేట గ్రామానికి కొన్ని సంవత్సరాల క్రితం కుటుంబ సభ్యులతో వచ్చాడు. శుక్రవారం పశులవులను మేపుకుంటూ గ్రామంలోని పెద్ద చెరువు సమీపం వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయాడు. శనివారం చెరువులో కోడి స్వామి శవమై స్థానికులకు కనిపించగా కుటుంబ సభ్యులకు సమచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 2: ప్రమాదవశాత్తు కాలు జారి భవనంపై నుంచి కింద పడిన ఒడిస్సా కార్మికుడు అజిత్‌కుమార్ వాస్(34) మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కరీంనగర్ రేకుర్తిలోని విజయపురి కాలనీలో భూక్య రాజు అనే ఇంటి యజమాని వద్ద సహాయకుడిగా పనిచేస్తున్న అజిత్‌కుమార్ వాస్ శుక్రవారం ఉదయం ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా రెండో అంతస్తుకు వెళ్లి కాలు జారి కిందపడ్డాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నెలనెలా పొదుపు డబ్బులు వసూలు చేసి మోసం


పోలీసులను ఆశ్రయించిన బాధితులు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 2: యూనిక్ కంపెనీ ఏజెంట్ పేరుతో నెల నెల పొదుపు డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వెంకటాపూర్ గ్రామానికి చెందిన సునీల్ యూనిక్ కంపెనీ ఫేక్ ఏజెంట్ అని తేలడంతో బాధితులు ఆయన ఇంటిని ముట్టడించారు. పొదుపు చేసిన డబ్బులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమారు 500 మంది బాధితుల నుంచి మూడు కోట్లకు పైగా డబ్బులు వసూలు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. మోసం చేసిన వ్యక్తి ఇంటిని ముట్టడించిన ఫలితం లేకపోవడంతో న్యాయం చేయాలంటూ బాధితులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పూర్తి వివరాలు సేకరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్సై రమాకాంత్ హామీ ఇచ్చారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వీణవంక,మార్చి2: మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన తాటికొండ రమణారెడ్డి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. నాలుగు రోజుల క్రితం రమణారెడ్డి కుటుంబం హైదరాబాద్‌కు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయం చుసిన గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబ్డారు. బీరువా తెరిచి మంగళహారతులు,కాళ్ళ పట్టీలు, మొలతాడు, దాదపు 55 తులాల వెండి, 16,500 విలువ గల వస్తువులు ఎత్తుకెళ్లినట్టు రమణారెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, మార్చి 2: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో వెంకటేష్, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు సునీల్, శ్రీనివాస్‌శర్మ పర్యవేక్షించారు.

వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

హుజూరాబాద్‌రూరల్, మార్చి 2: మండలంలోని ధర్మరాజుపల్లి, రాంపూర్, సిర్సపల్లి గ్రామాల్లో శనివారం జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ డి. శ్రీలత, డాక్టర్ బి. శ్రీనివాస్, డాక్టర్ బలరాం, డాక్టర్ సాయినాథ్‌లు పర్యటించారు. వరిలో పిలక దశలో మొగి పురుగు ఆశిస్తే పిలకలు ఎండి చనిపోతాయని, వరి పిలక దశలో కార్టప్ హైడ్రోక్లోరైడ్ ఎకరానికి 400 గ్రా. 160-200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేయాలన్నారు. అగ్గి తెగుల నివారకు ట్రై సైక్లోజోల్ ఎకరానికి 120 గ్రా. పిచికారి చేయాలన్నారు. ఏడీఏ సునీత, ఏవో సునీల్‌కుమార్, ఏఈవోలు ఉన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత


మెట్‌పల్లిలో నిల్వ చేసిన రేషన్ బియ్యం

మెట్‌పల్లి, మార్చి 2: పట్టణంలో అక్రమంగా నిలువ చేసిన రేషన్ బియ్యంను శనివారం ఎస్సై చిరంజీవి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టణంలోని శాంతి నగర్ కాలనీకి చెందిన కొండపల్లి మల్లయ్య ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యంను నిలువ చేసిన పక్క సమచారం మేరకు దాడులు చేయడం జరిగిందన్నారు. పట్టణాలు, గ్రామాల్లో తన మనుషులతో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసిన వాటిని తన ఇంట్లో నిలువ చేసి వాటిని ఇతర ప్రదేశాలకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంచారు. విషయం తెలుసుకొని దాడులు నిర్వహించగా అక్రమంగా నిలువ చేసిన 20క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని సాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బియ్యం నిలువ చేసిన కొండపల్లి మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న బియ్యంను రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.

కోరుట్ల సీఐగా సురేష్ బాబు



కోరుట్ల, మార్చి 2: కోరుట్ల సీఐగా సురేష్‌బాబు శనివారం బాధ్యతలను స్వీకరించారు. పోలీసు ఉన్నత అధికారులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కోరుట్ల సీఐగా పని చేసిన ప్రవీణ్ కుమార్‌ను ఐజీ కార్యాల యానికి బదిలీ చేయగా అక్కడ పని చేస్తున్న సురేష్ బాబును కోరుట్ల సీఐగా బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించడానికి సీఐ కార్యాలయానికి వచ్చిన సురేష్‌బాబుకు ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలను అందించి పోలీసు సిబ్బంది స్వాగతం పలికారు.

నాచుపల్లి యువకుడికి డాక్టరేట్



కొడిమ్యాల, మార్చి 2: మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కుమారుడు చిగుర్ల రవి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భూగోళ శాస్త్ర విభాగంలో డాక్టరేట్ సాధించాడు. చిగుర్ల రవిని తండ్రి బీరయ్య గొర్రెలను కాస్తూ ఉన్నత చదువులు చదివించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గీతా రెడ్డి అనంత్ పర్యవేక్షణలో స్పేషియల్ అనాలసీస్ ఆఫ్ ప్రైమరీ అగ్రికల్చర్ కోఆపేటివ్ సొసైటీస్ ఇంపాక్ట్ ఆఫ్ అగ్రో సర్వీసెస్ అండ్ సోషియో ఎకనా మిక్ ఎంపర్‌మెంట్ అనే అంశంపై పరిశోధన గ్రంధాన్ని సమర్పించడంతోనే డాక్టరేట్ వచ్చినట్లు రవి తెలిపారు. ఈ పరిశోధనల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు పలు విషయాలపై వాటి పరిష్కారానికి తగిన సూచనలు చేసినందుకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు తెలిపారు.

అలరించిన పోషకుల ఆటల పోటీలు


క్రీడలలో పాల్గొన్న మహిళలు

కోరుట్ల, మార్చి 2: పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ ఆధర్యంలో క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్, వాలీబాల్, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, స్కిప్పింగ్‌లతో పాటు ఇతర పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన తల్లిదండ్రులకు పాఠశాల నిర్వాహకులు బహుమతులు ప్రకటించగా ముఖ్య అతిథిగా హాజరైన వైద్యురాలు స్వాతి అనూప్‌రావు బహుమతులను అందించారు. విద్యార్థులతో పాటు వారి తల్లి దండ్రులకు ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని వైద్యురాలు స్వాతి అనూప్‌రావు అన్నారు. కార్యక్రమంలో పీఈటీ ప్రవీణ్ కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాహిత పాదయాత్రను విజయవంతం చేయండి

కొడిమ్యాల, మార్చి 2: ఈ నెల మొదటి వారంలో మండలంలోని నల్ల గొండ, చెప్యాల, మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో నిర్వహించే ప్రజా హిత పాదయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రేకుల పల్లి రవీందర్‌రెడ్డి కార్యకర్తలను కోరారు. శనివారం పార్టీ కార్యాలయం లో మండల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మూడవసారి దేశానికి ప్రధానిగా మోదీని, కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకుపోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు చల్ల శ్రీనివాసరెడ్డి, అంజయ్య, రాంచందర్‌రావు, శంకర్, శోభన్, మల్లేశం, శేఖర్, నాగరాజు, తిరుపతి, అరుణ్‌కుమార్, సుధాకర్ ఉన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్లాపూర్, మర్చి 2 : మల్లాపూర్ మండల కేంద్రంలోని శ్రీ కనక సోమేశ్వర దేవస్థానం జాతర పోస్టర్‌ను నాయకులు, నిర్వహకులు శనివారం ఆవిష్కరించారు. శివరాత్రిని పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం మల్లాపూర్ సోమేశ్వర కొండపైన శివుడి కల్యాణం జాతర వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతర ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు జరుపనున్నట్లు తెలిపారు. జాతరలో భాగంగా ఈనెల 8న స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

వెల్గటూర్, మార్చి 2: వెల్గటూర్ బీఆర్ఎస్ మాజీ గ్రామశాఖ అధ్యక్షుడు అంకం శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా శనివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల వివరాలు ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్, ఎండపల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాంచంద్రంగౌడ్, జగన్, మాజీ ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, ఎంపీటీసీ గాజుల మల్లేశం, జూపాక కుమార్, రంగు తిరుపతి, విద్యాసాగర్, మహేష్ పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

డీసీవో సీఈవో సత్యనారాయణ

మల్లాపూర్, మర్చి 2: మల్లాపూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సేవలను స్వదినియోగం చేసుకోవాలని డీసీవో సీఈవో సత్యనారాయణ అన్నారు. నాబార్డు రుణంతో మల్లాపూర్‌లో నిర్మిస్తున్న గోదాంను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి కేడీసీ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈయన వెంట కేడీసీసీ చైర్మన్ నరేష్, కార్యదర్శి భూమేష్, సిబ్బంది ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్‌డీవో

కోరుట్ల రూరల్, మార్చి 2 : కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారిగా ఆనంద్ కుమార్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఆనంద్ కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం సిరిసిల్ల నుంచి కోరుట్ల ఆర్‌డీవోగా బదిలి చేయగా ఇక్కడ పని చేసిన ఆర్‌డీవో రాజేశ్వర్‌ను వేములవాడకు బదిలీ చేసింది. బాధ్యతలు స్వీకరణకు వచ్చిన ఆర్‌డీవో ఆనంద్ కుమార్‌కు స్థానిక అర్‌డీఓ, రెవ్వెన్యూ కార్యాలయ అధికారులు కిషన్, రవీందర్‌లతో పాటు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఘనంగా మల్లన్న పల్లకీ సేవ

కోరుట్ల, మార్చి 2 : పట్టణంలో శనివారం మల్లన్న పల్లకి సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బీముని దుబ్బ ప్రాతంలోని మల్లన్న దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన యాదవులు ప్రత్యేకంగా అలంకరించిన మల్లన్న ఉత్సవ మూర్తితో పల్లకి సేవను నిర్వహించారు. పల్లకి సేవకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

సారంగాపూర్, మార్చి 2 : మండలంలోని పోతారం గణేష్‌పల్లి గ్రామంలో ఇరు వర్గాల ప్రజలు శనివారం ఘర్షణ పడ్డారు. స్థానికులు, ఎస్సై తిరుపతి కథనం ప్రకారం గణేష్‌పల్లికి చెందిన ఓ వర్గం వారికి కొంత కాలంగా ఘర్షణలు జరుగుతున్నాయి. గతంలో వినాయక నిమజ్జన వేడుకల్లో ఇరు వర్గాల మధ్య గొడవలు జరగడంతో కేసులు నమోదు అయ్యాయి. అయితే ఓ వర్గం వారిని కలం చిట్టీ నుంచి తీసివేశారు. దీంతో శనివారం ఇరు వర్గాల వారు బండ రాళ్ల, కర్రలు, కత్తులతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ దాడిలో రెండు వర్గాల వారు గాయపడ్డారు. ఇడగొట్టు సాయి కిరణ్ దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మిగిత వారు జగిత్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

- నేడు జిల్లా వ్యాప్తంగా 507 కేంద్రాల్లో పోలియో చుక్కలు
- 2,028 సిబ్బంది నియామకం
- జిల్లాలో 0-5 సంవత్సరాల్లోపు చిన్నారులు 93,832
- వంద శాతం లక్ష్యం సాధించేలా ప్రణాళిక


పల్స్‌పోలియో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

జగిత్యాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశా రు. ఈనెల 3వ తేదీన జిల్లాలోని 507 కేంద్రాల్లో అర్హులైన చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగంగా అధికారులు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాలో సుమారు 10.54 లక్షల జనాభా ఉంది.

ఇందులో 0 నుంచి 5 సంవత్సరాల్లోపు చిన్నారులు 91,234 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి పోలియో చుక్కలు వేయడానికిగానూ జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 75 కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో 432 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు 22 మొబైల్ బృందాలుండగా, పట్టణ ప్రాంతాల్లో 5, గ్రామీణ ప్రాంతాల్లో 17 మొబైల్ బృందాలు పనిచేయనున్నాయి. పోలియో చుక్కల పంపిణీకి ఏర్పాటు చేసిన కేంద్రా ల్లో 2,028 మంది వైద్య సిబ్బంది, ఇతరులు సేవలు అందించనున్నారు. వీరిలో 313 హెల్త్ వర్కర్లు, 1,045 మంది అంగన్‌వాడీ టీచర్లు, 744 మంది ఆశా వర్కర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, యువజన, స్వచ్ఛంద సంస్థల సభ్యులు సేవలు అందించనున్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి 50 మంది సూపర్‌వైజర్లను నియమించారు.

జిల్లాలో హైరిస్క్ గల ప్రాంతాలు 210 ఉన్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో సుమారు 1,906 మంది అర్హులైన చిన్నారులున్నట్లు అంచనా వేశారు. ఈనెల 3వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పోలియో చుక్కలు గల వ్యాక్సిన్స్‌ను నిలువ చేయడానికి ఒక్కో కేంద్రానికి నాలుగు కిలోల ఐస్ చొప్పున జి ల్లాలోని మొత్తం కేంద్రాలకు 5.5 టన్నుల ఐస్ అందుబాటులో ఉంచుతున్నారు. జిల్లాలో వసల కూలీలు ఉండే ప్రాంతాలు, ఇటుక బట్టీలలో పనిచేసే వారి పిల్లలు, భిక్షాటకులు వుండే ప్రదేశాలు, ఊరికి దూరంగా ఉండే వివిధ పరిశ్రమల వంటి ప్రదేశాలను గుర్తించారు. పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించడానికి పాఠశాలల విద్యార్థులచే ర్యాలీలు, ఫ్లకార్డుల ప్రదర్శన, ప్రధాన చౌరాస్తాలు, బస్టాండులు, పార్కులు, సినిమా హాళ్లు, వైద్య శాలలు తదితర ప్రాంతాల్లో బ్యానర్ల ప్రదర్శన, ప్రభుత్వ కార్యాలయాలు, చౌరస్తాల వద్ద వాల్ పోస్టర్లను అతికించి విస్తృత ప్రచారం నిర్వహి స్తున్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో సెక్రటరీ, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో టామ్ టామ్ (చాటింపు) కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈనెల 3వ తేదీన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాలలో పోలియో చుక్కలు వేయనుండగా, ఈ నెల 4వ, 5వ తేదీల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మిగిలి వున్న పిల్లలకు పోలియో చుక్కలు వేసే విధంగా ప్రణాళిక రూపొందించారు. వందశాతం పల్స్ పోలియోను విజయవంతం చేసే విధంగా అధి కారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పోలియో రహిత జిల్లాగా శాశ్వతంగా ఉంచాలి :

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



జగిత్యాలను పోలియో రహిత జిల్లా శాశ్వతంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నాము. ఇందులో భాగంగా ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. ఎప్పటికప్పుడు వివిధ స్థాయిల్లో అధికారులు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ పకడ్బందిగా అమలు చేసేలా ఏర్పాట్లు పూర్తిచేశాము. ప్రజలందరూ సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

వంద శాతం లక్ష్యం సాధిస్తాం

పుప్పాల శ్రీధర్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి



జిల్లాలో వంద శాతం పల్స్ పోలియో లక్ష్యాన్ని సాధించేలా ప్రణాళిక రూపొందించాము. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కేంద్రాల ఏర్పాటు, అర్హులైన చిన్నారుల గుర్తింపు, పల్స్ పోలియోలో పాల్గొనే ఆరోగ్య సిబ్బంది, ఇతరుల నియామకం తదితర కార్యక్రమాలు పూర్తి చేశాము. అర్హులైన చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేసి లక్ష్యం నెరవేర్చేలా చర్యలు తీసుకుంటున్నాము. అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో పల్స్ పోలియో పూర్తి చేస్తాము.

విందు భోజనం తిన్న ఐదుగురికి అస్వస్థత

కోరుట్ల రూరల్, మార్చి 2 : మండలంలోని అయిలాపూర్ గ్రామంలో విందు భోజనం తిన్న ఐదుగురు అస్వస్థతకు గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. శుక్రవారం రాత్రి జరిగిన విందు భోజనం తిన్న ముగ్గురు మహిళలు ఇద్దరు చిన్నారులు వాంతులు చేసుకున్నారు. గమనించిన బంధువులు వారిని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయంపై ఆసుపత్రి సూపరిండెంట్ సునితా రాణిని వివరణ కోరగా అస్వస్థతకు గురైయిన వారికి చికిత్స అందించనట్లు తెలిపారు. ఎవరికి ఎలాంటి హానీ లేదని తెలిపారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయాలి

కథలాపూర్, మార్చి 2 : ఈ నెల 3న మండలంలోని నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ జవ్వాజి రేవతి కోరారు. ఐదేళ్ళ లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో నివారణకు కృషి చేయాలని కోరారు. అంబారిపేట, కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 4 వేల మంది ఐదేళ్ళ లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఎండపల్లి, మార్చి 2 : మండలంలోని గొడిశెలపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తంగెళ్లపల్లి చక్రపాణి మాతృమూర్తి సుశీల(90) నాలుగురోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం రోజున మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి సుశీల మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సింహాచలం జగన్, గాజుల మల్లేశం, మేరుగు జాని, ఎండీ రియాజ్, ఏలేటి కృష్ణారెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ రహదారి నిర్మాణానికి సహకారం అందించాలి

కోరుట్ల రూరల్, మార్చి 2 : నూతనంగా నిర్మాణం చేస్తున్న జాతీయ రహదారి పనులను నిర్వహించడానికి సహకారం అందించాలని తహసీల్దార్ కిషన్ గ్రామస్థులకు సూచించారు. గ్రామంలోని భూయజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా భూయజమానులు రిజిస్ట్రేషన్ విలువ తక్కువగా ఉండడంతో బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం అందించాలని తహసిల్దార్‌కు వినతి పత్రం అందించారు. తహసీల్దార్ కిషన్ మాట్లాడారు. నిబంధన ప్రకారం రోడ్డు నిర్మాణం జరుగుతుందని భూయజమానుల సమస్యలను ఉన్నత అధికారులు దృష్టికి తీసుకవెళ్లి సరైన న్యాయం చేస్తామని తెలిపారు. ఆ కార్యక్రమంలో భూయజమానులు యాదగిరి ఆశోక్‌రావు, బూసం సతీష్, అడ్డగట్ల బలరాం, నాగభూషణం, మంద వెంకటి, కొత్తపల్లి శాంత, సంగనీ పెద్ద రాజం, సాగర్ రావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం


ఆత్మనగర్‌లో పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

మెట్‌పల్లి రూరల్, మార్చి, 2 : గ్రామాల్లో పారిశుధ్యం పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డీఎల్‌పీవో గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని ఆత్మనగర్ గ్రామంలోని పరసరాలు, పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. బాధ్యతలు స్వీకరించి మొదటి సారి గ్రామానికి వచ్చిన డీఎల్‌పీవోను మాజీ సర్పంచు జరుపుల శ్రీనివాస్, కార్యదర్శి నిజాముద్దీన్‌లు శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రత పచ్చదనంతో ఉండాలని, నర్సరీ, పకృతి వనంతో పాటు గ్రామంలో నాటిన చెట్లను పరిరక్షించుకోవాలన్నారు. వేసవిలో నీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలోని నిర్వహించిన పనుల వివరాలు ఎప్పకప్పుడు రికార్డుల్లో నమోదు చేసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

మల్లాపూర్, మర్చి 2: కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో పలువురు నాయకులు శనివారం పార్టీలో చేశారు. కాంగ్రెస్ సీని యర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ జలపతిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు చేరగా వారికి పార్టీ కండువా కప్పి స్వాగతించారు. నర్సింగరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీ చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జువ్వాడి కృష్ణారావు, కొమి రెడ్డి కరంచంద్, శ్రీనివాస్‌రెడ్డి, కోటగిరి ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

అగ్గి తెగులు, మొగిపురుగు నివారణపై రైతులకు అవగాహన

కథలాపూర్, మార్చి 2: మండలంలోని పోసానిపేట, భూషణరావుపేట గ్రామాల్లో అగ్గి తెగులు, మొగిపురుగు వరి పంటను ఆశించిన నేపథ్యంలో నివారణ మార్గాలపై వ్యవసాయాధికారులు రైతులకు శనివారం అవగాహన కల్పించారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ లీటర్ నీటికి 0.6 గ్రాములు, మొగిపురుగు నివారణకు క్లోరాంత నిప్రోలిన్ లీటర్ నీటికి 0.2 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలని ఏఈఓలు సుష్మశ్రీ, ఫెమీనా రైతులకు సూచించారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

మల్యాల, మార్చి 2: మండలంలోని మల్యాల, మానాల గ్రామాల్లో శనివారం ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్ పరిశీలించారు. కందకాల తవ్వకం, నర్సరీలు తదితరవి పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కూలి వేతనాలు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో స్వాతి, ఏపీవో శ్రీనివాస్ టీఏలు జలపతిరెడ్డి, లావణ్య, పంచాయితీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

డీఎస్పీకి సన్మానం

కోరుట్ల, మార్చి 2: మెట్‌పల్లి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఉమామహేశ్వర్‌రావును శనివారం కోరుట్ల పట్టణ కాంగ్రెస్ నాయకుడు ఆడెపు మధు మర్యాద పూర్వకంగా కలిసాడు. డీఎస్పీ ఉమామహేశ్వర్ రావు కు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. శాలువా పూల మాలతో సత్కరించారు.

కాంగ్రెస్ పథకాలతో పేదప్రజల అభివృద్ధి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు షాకీర్‌సిద్ధిక్


మెట్‌పల్లిలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న మహిళలు, నాయకులు

మెట్‌పల్లి, మార్చి, 2 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు అభివృద్ధి జరుగుతుందని పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు షాకీర్‌సిద్ధిక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారంటీలోని సంక్షేమ పథకాలు అమలు చేసినందుకు శనివారం పట్టణంలోని 11వ, 12వ వార్డులలోని ప్రజలు సీఎం రేవంత్, సోనియా గాంధీ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జువ్వాడి నర్సింగరావుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసినంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేక్‌ను ఆయన కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలోని గృహజ్యోతి పథకం ద్వారా 200యూనిట్ల ఉచిత కరెంట్, మహాలక్ష్మి పథకం ద్వారా రూ. 500లకే గ్యాస్ సిలిండర్ పథకాలతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారన్నారు. మెట్‌పల్లి పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకుడు, మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి వేడుకలు నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారావు, లింగం, తిప్పి రెడ్డి అంజిరెడ్డి ఉన్నారు.

శ్రీపాదరావు ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 2: దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. అసెంబ్లీలో శ్రీపాదరావు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీపాదరావు చిత్రపటానికి ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు పలువురు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంథని ఎమ్మెల్యేగా మూడు సార్లు పని చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఇదిలా ఉండగా ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో కూడే దివంగత స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ ఆధ్వర్యంలో పలువురు అధికారులు, పాలకవర్గ సభ్యులు ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి, జక్కు పద్మ, సంగనభ ట్ల సంతోషి, అయ్యోరు వేణుగోపాల్, సుధాకర్, అశోక్, మేనేజర్ గంగాధర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్, కో ఆప్షన్ సభ్యులు, పాల్గొన్నారు.

జగిత్యాల, (జగిత్యాల టౌన్): జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అడిషనల్ ఎస్పీలు ప్రభాకర్ రావు, భీమ్ రావులు హాజరై శ్రీపాదరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి, స్పీకర్‌గా అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో అమర్నాథ్, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఐలు జానీ మియా, వేణు ఉన్నారు.

పెగడపల్లి : శ్రీపాదరావు జయంతి వేడుకలను శనివారం పెగడపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, రాష్ట్రానికి ఆయన చేసిన సేవల ను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, నాయకులు సంధి మల్లారెడ్డి, రాజు, అనీల్ గౌడ్, కడారి తిరుపతి, పూసాల తిరుపతి, అంజయ్య, కిషన్, మహేందర్, శ్రీనివాస్, వంశీదర్‌రావు, శ్రీధర్ రావు, పవన్ రెడ్డి పాల్గొన్నారు.

మల్యాల: మాజీ స్పీకర్ డి.శ్రీపాదరావు జయంతి వేడుకలను మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. శ్రీపాదరావు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎంపీడీవో స్వాతి, ఎంపీవో వాసవి, ఏపీవో శ్రీనివాస్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు

కొడిమ్యాల : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని అధికారులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేశారు. ఎంపీడీవో స్వరూప, సూపరిండెంట్ సురేందర్, సీనియర్ అసిస్టెంట్ సురేష్, ఎంపీవో ప్రవీణ్, టైపిస్ట్ అరుణ్ పాల్గొన్నారు.


అసెంబ్లీలో నివాళులర్పిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


నివాళులు అర్పిస్తున్న అడిషనల్ ఎస్పీలు


మల్యాలలో నివాళులు అర్పిస్తున్న అధికారులు